

ఎప్పటిలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డైరీ మిల్క్ చాక్లెట్ ఇచ్చి.. స్వాగతం పలుకుతున్న అమలాపురం ఎంపీ చింతా అనురాధ

స్వాగతాంజలి..









వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమానికి కాకినాడ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్

ఇంటింటికీ తాగునీరు

- జల్‌జీవన్ మిషన్ ద్వారా పల్లె ప్రజలకు సురక్షిత నీరు
- మండల పరిధిలో 20 వేల కుటుంబాలకు ప్రయోజనం
- గ్రామాల్లో చురుగ్గా జరుగుతున్న పనులు

ముమ్మిడివరం: ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభించింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. మండల పరిధిలో ఇంటింటికీ కుళాయి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఇందుకు కోట్లాది రూపాయలు మంజూరయ్యాయి.

సురక్షిత నీరే లక్ష్యంగా..

గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు స్వచ్ఛంగా అందించేందుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటోంది. నిత్యం తాగే నీటిలో నైట్రేట్, ఫ్లోరైడ్, సల్ఫేట్, కాల్షియం, ఐరన్ తదితర మూలకాలు ఉంటాయి. వివిధ రకాల రసాయనాల వల్ల తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశముంది. అందుకే ప్రతి ఒక్కరికీ అవసరమైన మూలకాలు ఉండే తాగునీటిని అందించడం దీని ప్రధానోద్దేశం.

ప్రతి కుటుంబానికీ 55 లీటర్ల నీరు

జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో సురక్షితమైన తాగునీటిని ఏర్పాటు చేయడానికి మండల పరిధిలో పలు గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి 55 లీటర్ల సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు.



అన్నంపల్లిలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు



నిర్మాణంలో ఉన్న పైపులైన్

పూర్తి కావస్తున్న పనులు



జల్‌జీవన్ మిషన్ పైపు లైన్ల పని దాదాపు పూర్తి చేశాం. ఇంటింటికీ కుళాయి పనులు చేపడుతున్నాం. ప్రతిరోజు జరుగుతున్న పనులను సమీక్షించి, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నాం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని ప్రతి కుటుంబానికి అందించడం ప్రభుత్వ ఉద్దేశం. అందుకనుగుణంగా ప్రజలు తాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– వి.నానాజీరావు, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ముమ్మిడివరం

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

మండల పరిధిలో 27 గ్రామాల్లో 48 ఆవాస ప్రాంతాలున్నాయి. ఆయా గ్రామాలు, ఆవాస ప్రాంతాల పరిధిలో సుమారు 20 వేల కుటుంబాలున్నాయి. గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో మూడు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. తొలి విడతలో 21 పనులకు రూ.7.92 కోట్ల నిధులు మంజూరు చేయగా, రెండో విడతలో 16 పనులకు రూ.3.56 కోట్లు మంజూరు చేశారు. మూడో విడతలో 17 పనులకు రూ.5.16 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం మూడు విడతల పనులు గ్రామాల్లో చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి కుటుంబానికి 55 లీటర్ల వంతున 20 వేల కుటుంబాలకు తాగునీరు అందజేయనున్నారు.

మహిళా విద్యకు పోరాడిన స్త్రీమూర్తి

- ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి
- ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల నివాళులు

అమలాపురం టౌన్: తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే మహిళా విద్య కోసం ఎన్నో పోరాటాలు చేసి, ఆ దిశగా సంస్కరణలు సాధించారని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. స్థానిక 23వ వార్డులోని నారాయణపేటలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల హెచ్‌ఎం బీవీఎస్‌సీ పోలిశెట్టి సభకు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా సత్య నాగేంద్రమణి హాజరయ్యారు. తొలుత సావిత్రీబాయి పూలే చిత్రపటానికి ఆమె పూలమాల వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..

ముమ్మిడివరం: దేశంలో తొలి మహిళా పాఠశాలను స్థాపించిన సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. నగర పంచాయతీ తిల్లమ్మ చెరువు ప్రాథమిక పాఠశాలలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు, బి.శరత్, సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

ఉప్పలగుప్తం: భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గొల్లవిల్లి, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు ఎస్.సత్యనారాయణ, ఎల్.రాణి ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, ఉపాధ్యాయులు



గొల్లవిల్లి జెడ్పీ హైస్కూల్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

ప్రముఖుల నివాళులు

తాళ్లరేవు: సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు కేఎస్ శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధి అత్తిలి బాబూరావు నివాళులర్పించారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

కేంద్ర మంత్రి రూపాలా



చెక్కులను అందజేస్తున్న మంత్రులు రూపాలా, మురుగన్

యానాం: తీరప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఇప్పటివరకు ఐదు రాష్ట్రాల్లో ఏడు వేల కి.మీ. పర్యటించానని కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలా అన్నారు. బుధవారం యానాం శివారు సావిత్రినగర్ ఫిషింగ్ హార్బర్ ఆవరణలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సాగర్ పరిక్రమ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాగర పరిక్రమ కార్యక్రమంలో భాగంగా మారుమూల తీర గ్రామాలను తిరిగి మత్స్యకారుల సమస్యలను ప్రత్యక్షంగా చూశానన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ వేట నష్ట పరిహారం త్వరితంగా ఇచ్చేలా కృషి చేయాలని, బోట్లకు డీజిల్ సబ్సిడీని ఇవ్వాలని కోరారు. అనంతరం రూ.2.81 కోట్ల విలువైన చెక్కులను కేంద్ర మంత్రి మత్స్యకారులకు అందజేశారు. గిరియాంపేట, సావిత్రినగర్ పెద్దలు తమ సమస్యలను వివరించారు. కేంద్ర సహాయ మంత్రి మురుగన్, కేంద్ర మత్స్య శాఖ కార్యదర్శి నీతూకుమారి, ఆర్ఏఓ మునిస్వామి, మత్స్య శాఖ ఏడీ గొంతియ్య పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించే 'ఆడుదాం ఆంధ్రా'



కేశనకుర్రులో క్రికెట్ ఆడుతున్న వెంకటపతిరాజు, క్రీడాకారులు



గొల్లవిల్లిలో క్రికెట్ క్రీడాకారులతో ఎంపీడీఓ గౌరీకుమారి తదితరులు

ఐ.పోలవరం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ద్వారా క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అన్నారు. కేశనకుర్రు జెడ్పీ పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆటలను ఆయన ప్రారంభించారు. ఆయన బౌలింగ్, బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు చాలా ముఖ్యమని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందుకూరి రంగరాజు, రేవు వెంకటేశ్వరరావు, యలమంచలి వాసు, చింతా రాంబాబు, శీలం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: చదువుతో పాటు ఆటల్లో బాలికలు రాణించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కేఎస్ గౌరీకుమారి అన్నారు. గొల్లవిల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో గొల్లవిల్లి సచివాలయం తరఫున క్రికెట్ పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్.రాణి, పీడీ గొలకోటి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు భరోసా

మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు తోడుంటే వైద్య భరోసా ఉన్నట్టేనని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. పట్టణంలోని 11, 14వ వార్డులకు స్థానిక వార్డు సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి ప్రారంభించారు. ఈ శిబిరానికి హాజరైన వారికి వైద్యులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు వాసంశెట్టి కృష్ణకుమారి, నాగారపు వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య సేవలు పొందిన వారికి చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేశారు. మున్సిపల్ మేనేజర్ మాచిరాజు మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ఖ్వాజాబాబు, రెడ్డి సత్యనారాయణ, వార్డు సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సురక్ష కార్డులు అందజేస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు

వసతి గృహాలకు టీవీల బహూకరణ



వసతి గృహాలకు టీవీలు బహుకరిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో వివిధ వసతి గృహాలకు దాతలు సమకూర్చిన టీవీలను బుధవారం బహూకరించారు. ముమ్మిడివరం రెవెన్యూ సిబ్బంది సమకూర్చిన టీవీని స్థానిక గురుకుల పాఠశాలకు, మర్చంట్స్ అసోసియేషన్ సమకూర్చిన రెండు టీవీలను కళాశాల బాలుర వసతిగృహానికి, కళాశాల బాలికల వసతిగృహానికి, డా.జగన్‌మోహన్‌రావు సమకూర్చిన టీవీని హైస్కూలు బాలికల వసతి గృహానికి, మెప్మా సిబ్బంది సమకూర్చిన టీవీని హైస్కూల్ బాలుర వసతి గృహానికి, అమలాపురానికి చెందిన కేవీడీ రమేష్ సమకూర్చిన టీవీని హైస్కూల్ ఎస్సీ బాలుర వసతిగృహానికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు బొంతు సత్యశ్రీనివాస్, నాయకులు రెడ్డి శివనారాయణ, కాండ్రేగుల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర కమిటీ 2024 ఏడాదికి భారతీయ శాస్త్రవేత్తల చిత్రాలతో ముద్రించిన క్యాలెండర్‌ను జేవీవీ జిల్లా కమిటీ ప్రతినిధులు స్థానిక ఎంప్లాయిస్ హోంలో బుధవారం ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ క్యాలెండర్లు విద్యార్థులకు ఎంతో విజ్ఞానదాయకంగా ఉంటాయని డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా మొహిద్దీన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా భౌతిక శాస్త్ర రిసోర్స్‌పర్సన్ అబ్బిరెడ్డి రామకృష్ణ, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు జె.సత్యనారాయణ, కోశాధికారి జి.త్రినాథ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు

వెంకన్నకు లక్ష చామంతి, తులసి పూజలు

అమలాపురం టౌన్: దేవ తిలకుల భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి లక్ష చామంతి, లక్ష తులసి పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి వెంకట సత్యనారాయణాచార్యులు, శ్రీనివాసుల విజయ గోపాల ఆచార్యులు బ్రహ్మత్వంలో స్వామి వారికి ఈ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు లక్ష కుంకుమ పూజలు చేశారు. దేవ తిలకుల భక్త బృందం 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పూజాదికాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, భక్త బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని సత్య రత్నకళకు నగదు బహుమతి

అమలాపురం టౌన్: మంచి మార్కులు పొందిన స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థిని ఎం.సత్య రత్నకళకు అమలాపురం యోగ సత్సంగ ధ్యాన మండలి ట్రస్టీ ప్రతినిధి రమణి రూ.2 వేల నగదు బహుమతిని అందజేశారు. ధ్యాన మండలి భవనంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం, నగదు బహుమతి ఇచ్చారు. ఎంపీసీ చదువుతున్న సత్య రత్నకళ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 470కి 454 మార్కులు సాధించి కళాశాల స్థాయిలో ప్రథమంగా నిలిచింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆకెళ్లకు డాక్టరేట్



డాక్టర్ ఆకెళ్ల సుబ్రహ్మణ్య నరసింహరాజు

అమలాపురం టౌన్: చెన్నైకు చెందిన ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కూచిమంచి అగ్రహారానికి చెందిన ఆకెళ్ల సుబ్రహ్మణ్య నరసింహరాజుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పెద్ద పేగు క్యాన్సర్‌ను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డీప్ లెర్నింగ్ పద్ధతుల ద్వారా స్వయం చలికా విధానంతో కనిపెట్టిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది. గత మూడున్నరేళ్లుగా చెన్నై ఎస్ఆర్ఎంలో ఆయన పీహెచ్‌డీ చేస్తున్నారు. మెడికల్ విభాగంలో మరి కొన్ని కొత్త ప్రయోగాలు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకూ ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో తన 8 పేపర్లు పబ్లిష్ అయ్యాయని తెలిపారు. చెన్నై ఎస్ఆర్ఎంలో ఇటీవల ఆకెళ్ల డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని దండిగల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం



అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న గోకవరపు అన్నపూర్ణ

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి నిత్య అన్నదాన ట్రస్టుకు భక్తులు విరాళమిచ్చారు. గ్రామానికి చెందిన గోకవరపు అన్నపూర్ణ, కాకినాడకు చెందిన క్రాంతికుమార్ దంపతులు ఒకొక్కరు రూ.10 వేల చొప్పున బుధవారం ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించారు. వీరి వెంట సర్పంచ్ కాశే రాజుబాబు ఉన్నారు.

బీమాతో కుటుంబానికి భరోసా



బీమా నమోదు చేస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ రాజారావు

అమలాపురం రూరల్: ప్రమాద బీమాతో కుటుంబానికి భరోసా దక్కుతుందని రంగాపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్ మామిళ్లపల్లి రాజారావు అన్నారు. రంగాపురం పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఈ నెల 3 నుంచి 10 వరకు జరగనున్న బీమా నమోదు శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. తపాలా శాఖ, పీఏసీఎస్ సంయుక్తంగా పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు బీమా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. 18 నుంచి 65 ఏళ్ల లోపువారు ఈ ప్రమాద బీమాకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఎరుబండి శివ పాల్గొన్నారు.

అక్రమ డీజిల్ ట్యాంకర్ పట్టివేత

ముమ్మిడివరం: యానాం నుంచి డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్న ట్యాంకర్‌ను ముమ్మిడివరం పోలీసులు పట్టుకున్నారు. యానాం నుంచి ఆత్రేయపురానికి ట్యాంకర్‌లో డీజిల్‌ను అక్రమంగా తరలిస్తుండగా, బుధవారం రాత్రి ముమ్మిడివరం బైపాస్ రోడ్‌లో ట్రైనీ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, ఎస్సై ఎస్.శివప్రసాద్ దాడి చేసి పట్టుకున్నారు. ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ట్యాంకర్‌లో సుమారు 3 వేల లీటర్ల డీజిల్ ఉన్నట్టు సమాచారం.

మిథున్‌రెడ్డిని కలిసిన ఖాదర్



మిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఖాదర్

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డిని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని మిథున్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయనను మంగళవారం రాత్రి కలిసినట్టు ఖాదర్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల వక్ఫ్ బోర్డుల చైర్మన్లు మిథున్‌రెడ్డిని కలసి వక్ఫ్ భూములపై చర్చించినట్టు ఖాదర్ అమలాపురంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం కె.వెంకటలక్ష్మి అధ్యక్షతన ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ బైజూస్ ట్యాబ్‌ల వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని, ఈ–నాలెడ్జ్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ట్యాబ్‌లు సక్రమ రీతిలో పాఠ్యాంశాలు నేర్చుకోవడానికి ఉపయోగించాలన్నారు. ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, సర్పంచ్ కాశే రాజుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, వీరేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఎంపీటీసీ ఎం.శివరాంబాబు, మాజీ జెడ్పీటీసీ కాశి పరివాజ్ కుమార్ తదితరులు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

అటుకుల మిల్లు డ్రైవర్‌కు గాయాలు

అల్లవరం: కొమరగిరిపట్నంలో అటుకుల మిల్లు ఆడుతున్న డ్రైవర్ నూటుకుర్తి నాని అరచేయి బెల్ట్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. గోడి గ్రామానికి చెందిన నాని రెండు నెలల క్రితం అటుకుల మిల్లులో డ్రైవర్‌గా చేరాడు. మంగళవారం రాత్రి అటుకులు ఆడుతున్న సమయంలో బెల్ట్‌లో చిక్కుకుని అరచేయి నలిగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు అతడిని అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

జాబ్ కార్డుకు ఆధార్ లింక్ చేయాలి

అల్లవరం: ఉపాధి హామీ పథకంలో ఉపాధి పొందుతున్న కూలీలు తమ జాబ్ కార్డులకు ఆధార్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. అల్లవరంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న జాబ్ కార్డులను త్వరితగతిన లింక్ చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఆధార్ లింక్ కాకపోతే చెల్లింపులు నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. ఆధార్ లింక్ చేయని వారికి పని కల్పించవద్దని సూచించారు. సమావేశంలో ఏపీఓ శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

అమలాపురం రూరల్: జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలోని మండల విద్యా శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమలాపురం ఆర్డీఓ కార్యాలయంలో జేఏసీ నాయకులు బుధవారం వినతి పత్రం అందించారు. విద్యా శాఖలోని వివిధ విభాగాల్లో ఉన్న ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ మురళీకృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జేఏసీ నాయకులు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా జేఏసీ నాయకులు వెంకట్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవ హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న అక్షయపాత్ర ప్రతినిధులు, భక్తులు

అమలాపురం టౌన్: కాల భైరవాష్టమి సందర్భంగా స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నియలంలో బుధవారం సాయంత్రం కాలభైరవ అఖండ హోమం ఘనంగా జరిగింది. లింగోలు విస్సు, శిరీష దంపతులు కర్తలుగా ఈ హోమాన్ని నిర్వహించారు. గౌతమ మహర్షి అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ హోమంలో కాలభైరవ మంత్ర జపంతో పూజలు చేశారు. మార్గశిర మాస బహుళ అష్టమిని కాలభైరవ అఖండ హోమంగా నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే పూర్ణాహుతితో హోమం ముగుస్తుందని తెలిపారు. అక్షయ పాత్ర ప్రతినిధులు అరిగెల బుజ్జి, తూము దొరబాబు తదితరులు సేవలందించారు.

నేత్రదానం



సూర్యనారాయణ(ఫైల్)

తాళ్లరేవు: కాకినాడ గాంధీనగర్‌లో నివసిస్తున్న తాళ్లరేవుకు చెందిన ముత్యాల సూర్యనారాయణ(90) బుధవారం మరణించారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ సమక్షంలో ఆయన నేత్రాలను బాదం బాలకృష్ణ ఐ–బ్యాంక్‌కు దానం చేశారు. సూర్యనారాయణ కార్నియాలను ఐ–బ్యాంక్ సిబ్బంది సేకరించారు. గతంలో సూర్యనారాయణ జిల్లా క్రీడాధికారిగా సేవలందించారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

యానాం: యానాం ప్రభుత్వాస్పత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న 42 మంది సిబ్బంది బుధవారం స్థానిక జీజీహెచ్ ఆవరణలో నిరసన చేపట్టారు. వారికి 46 నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో ఈ ఆందోళన చేశారు. తక్షణం తమకు చెల్లించాల్సిన బకాయి జీతాలను విడుదల చేయాలని కోరారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

యానాం: పుదుచ్చేరి కోఆపరేటివ్ శాఖలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ వెలువడింది. పుదుచ్చేరి నివాసులైన వారిని జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ (గ్రూప్–సి) 38 ఖాళీలను రాతపరీక్ష ద్వారా భర్తీ చేస్తామని కోఆపరేటివ్ రిజిస్ట్రార్ యశ్వంతయ్య తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 5 నుంచి ఫిబ్రవరి 4లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 2016లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ చేయనవసరం లేదని చెప్పారు.